తెలంగాణను రేవంత్ చారాణాకు అమ్మేస్తడు

- సీఎం మార్పు కోసం 400 మందిని పాట్టన పెట్టుకున్నది కాంగ్రెస్ కాదా?
- కష్టార్జిత రాష్ట్రం ఆగం కావొద్దు
- సోషల్ మీడియాను బ్రహ్మాస్త్రంగా వాడాలి
- నియోజకవర్గాల్లో సమ్మేళనాలు పెట్టండి
- బీఆర్ఎస్వీ సమావేశంలో కేటీఆర్

బీఆర్ఎస్వీ సమావేశంలో యువ కార్యకర్తలతో కరచాలనం చేస్తున్న మంత్రి కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ): 'రేవంత్‌కు చాన్స్ ఇస్తే తెలంగాణను కోతిల చారాణకు అమ్మేస్తడు' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ అన్నారు. ముఖ్యమంత్రి మార్పు కోసం హైదరాబాద్‌లో 400 మందిని పొట్టునపెట్టుకున్న చరిత్ర కాంగ్రెస్ పార్టీదని గుర్తుచేశారు. కష్టపడి తెచ్చుకున్న రాష్ట్రాన్ని ఆగం కానివ్వద్దని విజ్ఞప్తి చేశారు. అనేక దశాబ్దాలపాటు, అనేక త్యాగాలు చేసి వందల మంది విద్యార్థులను బలితీసుకున్న వారి చేతిలో తెలంగాణ పెడితే ఎలా ఉంటుందో ఆలోచించాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీ చేసిన మోసాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఆదివారం తెలంగాణభవన్‌లో బీఆర్ఎస్వీ విస్తృత సమావేశం జరిగింది. బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్, మాజీ ఎమ్మెల్సీలు కర్నె ప్రభాకర్, జీహెచ్ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియొద్దీన్ సహా 33 జిల్లాల బీఆర్ఎస్వీ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్న ఈ సమావేశంలో కేటీఆర్ ప్రసంగించారు. రానున్న 30 రోజుల్లో విద్యార్థి నాయకులు అనుసరించాల్సిన వ్యూహంపై దిశానిర్దేశం చేశారు. సోషల్ మీడియాను బ్రహ్మాస్త్రంగా వినియోగించుకొని కాంగ్రెస్, బీజేపీ సృష్టిస్తున్న గందరగోళాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. గురుకులాల్లో చదివి ప్రతిష్ఠాత్మక ఐఐటీ, ఐఐఎం, నీట్, ఎన్ఐటీ వంటి సంస్థల్లో సీటు దక్కించుకున్న విద్యార్థులతో సెల్ఫీలు దిగి సోషల్ మీడియాలో పోస్ట్ చేయాలని చెప్పారు. ఈ తరం విద్యార్థులకు తెలంగాణ ఉద్యమం గురించి వివరించాల్సిన బాధ్యత తీసుకోవాలని అన్నారు.

తెలంగాణకు కర్కశ కాంగ్రెస్ ఏం చేసింది?

కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు తీరని అన్యాయం చేసిందని, ఆ అన్యాయాలను కండ్లకు కట్టినట్టు వివరించాలని కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. '1956లో తెలంగాణకు ఇష్టం లేని బలవంతపు పెండ్లి చేసింది కాంగ్రెస్సే. 1968లో 379 మంది విద్యార్థి, యువకులను పోలీస్ కాల్పుల్లో కాల్చి చంపింది కాంగ్రెస్సే. 2004లో తెలంగాణ ఇస్తామని మాట ఇచ్చి తప్పుకోవటం వల్ల శ్రీకాంతాచారి, ఇషాన్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, యాదయ్య, యాదిరెడ్డి వంటి 1,200 మంది బలిదానాలకు కారణం బలిదేవత సోనియాగాంధీ కాదా?' అని కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో విద్యార్థులను, యువజనులను గుర్తించి ఆదరించింది.. వారికి ప్రజాప్రతినిధులుగా, కార్పొరేషన్ల చైర్మన్లగా అవకాశం కల్పించింది సీఎం కేసీఆర్ అని చెప్పారు.

నియోజకవర్గాల్లో సమ్మేళనాలు పెట్టండి

రానున్న 30 రోజుల్లో రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో విద్యార్థి, యువజన సమ్మేళనాలు నిర్వహించాలని మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. ఉద్యోగాల భర్తీపై ప్రభుత్వం మీద, పార్టీ మీద విపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టే కార్యాచరణ రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో 119 నియోజకవర్గాల్లో పోటీచేసేది సీఎం కేసీఆరే అన్న విషయాన్ని విద్యార్థి యువతకు చెప్పాలని సూచించారు. విద్వేషపు బీజాలు నింపుతున్న బీజేపీ నిజస్వరూపాన్ని, కర్కశ కాంగ్రెస్ రీతిని, నీతిని వివరించాలని కోరారు. కులం పేరుమీద రాజకీయాలు చేసేవారి పట్ల మన సమాజాన్ని అప్రమత్తం చేయాలని పేర్కొన్నారు.

ఇవి నిజాలు కావా?

- 2004 నుంచి 2014 వరకు 10 ఏండ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏపీపీఎస్సీ ద్వారా 24 వేల ఉద్యోగాలను మాత్రమే భర్తీ చేసింది. ఇందులో తెలంగాణ వాటా 10వేల ఉద్యోగాలు. అంటే కాంగ్రెస్ సంవత్సరానికి భర్తీ చేసింది 1000 ఉద్యోగాలే.
- 2014 నుంచి 2023 వరకు తెలంగాణ ప్రభుత్వం భర్తీ చేసిన ఉద్యోగాల సంఖ్య 1,32,000. ఇంకా 90 వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కొనసాగుతున్నది.
- తెలంగాణ బిడ్డలకే తెలంగాణ ఉద్యోగాలు దక్కాలని నూతన జోనల్ విధానాన్ని తీసుకొచ్చి 95 శాతం ఉద్యోగాలు కల్పించింది బీఆర్ఎస్ ప్రభుత్వం, కేసీఆర్ కాదా?
- బండి సంజయ్ అనుచరుడు పేపర్ లీక్ చేసింది నిజం కాదా? గ్రూప్-1 పరీక్షను వాయిదా వేయాలన్నది సంజయ్, కాంగ్రెస్, ఆర్ఎస్ ప్రవీణ్ కాదా?
- టీఎస్ఐపాస్ విధానంతో 24 లక్షల ఉద్యోగాలు కల్పించింది నిజం కాదా?
- 20,984 మంది టీచర్లను గురుకులాల్లో భర్తీ చేసింది నిజం కాదా? డీఎస్సీ వేస్తేనే టీచర్ రిక్రూట్‌మెంట్ చేసినట్టా?
- కేంద్రంలో బీజేపీ ఉన్న ఉద్యోగాలు ఊడగొడుతున్నది నిజం కాదా? ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి చేసిందా? బీజేపీ బాత్ కరో డోమే...కామ్ పకోడోమే అంటే ఇది కాదా?
- కేంద్రంలో 145 కోట్ల జనాభాలో 59 లక్షల ఉద్యోగాలుంటే (0.4 శాతం మాత్రమే). ఈ 59 లక్షల ఉద్యోగాల్లో ఖాళీలు 16 లక్షలు అవునా? కాదా?
- నవరత్నాలు, మహారత్నాలు వంటి ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ పరం చేయటం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు కోల్పోతున్నది నిజం కాదా?
- కేంద్రం ప్రభుత్వ సంస్థలను అమ్ముతుంటే.. తెలంగాణ బతికిస్తున్నది నిజం కాదా? ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసింది. సింగరేణిని బలోపేతం చేస్తున్నది. ఎల్ఐసీ, బీహెచ్ఈఎల్ సంస్థలను బతికిస్తున్నది సీఎం కేసీఆర్ కాదా?

మీడియాతో మాట్లాడుతున్న నాగం. చిత్రంలో మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు

కాంగ్రెస్‌లో డబ్బున్నోళ్లకే టికెట్లు

- ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నా
- మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి
- బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించిన మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు
- సముచిత స్థానం కల్పిస్తాం: కేటీఆర్
- ముఖ్యమంత్రి కేసీఆర్‌తో నాగం భేటీ

హైదరాబాద్, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌లో డబ్బులున్న వారికి, కొత్తగా వచ్చిన వారికే టికెట్లు ఇస్తున్నారని మాజీ మంత్రి, ఆ పార్టీ సీనియర్ నేత నాగం జనార్దన్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్‌లో జరుగుతున్న పరిణామాలతో తాను ఆ పార్టీకి రాజీనామా చేశానని ఆదివారం ప్రకటించారు. ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌ను కాంగ్రెస్ తుంగలో తొక్కిందని మండిపడ్డారు. తనకు ఎందుకు టికెట్ ఇవ్వలేదని రేవంత్‌ను ప్రశ్నిస్తే సునీల్ కనుగోలు టీం సర్వే ఆధారంగా అభ్యర్థిని ప్రకటించామని చెప్పారని వాపోయారు. నాగర్‌కర్నూల్ భవిష్యత్తు కోసమే బీఆర్ఎస్‌లో చేరుతున్నట్టు స్పష్టంచేశారు. మర్రి జనార్దన్‌రెడ్డితో కలిసి పనిచేస్తానని వెల్లడించారు.

నాగం ఇంటికి కేటీఆర్, హరీశ్‌రావు

నాగం జనార్దన్‌రెడ్డిని బీఆర్ఎస్‌లోకి రావాల్సిందిగా మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి వెళ్లి ఆహ్వానించారు. నాగం.. పార్టీలో చేరడానికి సుముఖత వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ సూచన మేరకు నాగం జనార్దన్‌రెడ్డిని, ఆయన అనుచరులను పార్టీలోకి ఆహ్వానించడానికి వచ్చామని చెప్పారు. సీఎం కేసీఆర్‌తో జనార్దన్‌రెడ్డికి నాలుగు దశాబ్దాలకు పైగా సాన్నిహిత్యం ఉన్నదని గుర్తుచేశారు. నాగం బీఆర్ఎస్‌లోకి రావడం అంటే ఇద్దరూ చిరకాల మిత్రులు కలిసి నడిచినట్టుగా తాను భావిస్తున్నానని పేర్కొన్నారు. వీరి భేటీ అనంతరం నాగం ప్రగతిభవన్‌కు వెళ్లి సీఎం, బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇద్దరూ పలు అంశాలపై చర్చించుకున్నారు. ఈ భేటీలో ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, మర్రి జనార్దన్‌రెడ్డి, దాస్యం వినయ్‌భాస్కర్ తదితరులు ఉన్నారు.

టికెట్ ఇవ్వకుండా అవమానించారు!

- విలువలు చంపుకొని కాంగ్రెస్ పార్టీలో కొనసాగదలుచుకోలేదు
- హైకమాండ్‌కు రాజీనామా లేఖలో నాగం జనార్దన్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ కోసం తీవ్రంగా కష్టపడ్డా.. టికెట్ ఇవ్వకుండా తీవ్ర అవమానానికి గురిచేశారని ఆ పార్టీ నేత నాగం జనార్దన్‌రెడ్డి అన్నారు. తనను సంప్రదించకుండానే, అదీ పార్టీ మారి వచ్చిన వ్యక్తికి టికెట్ ఇవ్వటం బాధ కలిగించిందని తెలిపారు. ఈ మేరకు కాంగ్రెస్ అధిష్ఠానానికి ఆయన రాజీనామా లేఖ రాశారు. ఆ లేఖలోని సారాంశం ఆయన మాటల్లోనే.. 'కాంగ్రెస్ ఎదుగుదలకు శక్తివంచన లేకుండా కృషి చేశా. కమిటీల ఏర్పాటును విజయవంతంగా నిర్వహించా. ఏఐసీసీ, టీపీసీసీ కార్యక్రమాలన్నింటినీ నిజాయతీగా నిర్వహించా. వరంగల్ రైతు డిక్లరేషన్, హైదరాబాద్ యువజన డిక్లరేషన్‌కు, తుక్కుగూడ విజయభేరికి మద్దతుదారులతో హాజరై, కార్యక్రమాల విజయవంతంలో భాగస్వామిని అయ్యా. దళిత, గిరిజనులపై జరిగిన దాడికి వ్యతిరేకంగా 50 వేల మందితో 'దళిత్ గిరిజన ఆత్మగౌరవ సభ' నిర్వహించా. 30 ఏండ్లలో నాగర్‌కర్నూల్‌లో పార్టీని విజయపథంలో నడిపించేలా కృషి చేశా. ఎలాంటి కారణం లేకుండా నాకు టికెట్ నిరాకరించటం ఆశ్చర్యానికి గురి చేసింది. టికెట్ కేటాయించే ముందు ఎవరూ నన్ను సంప్రదించలేదు. ఇది నాకు చాలా బాధ కలిగించింది. అవమానానికి గురి చేసింది. కాంగ్రెస్ లాంటి జాతీయ పార్టీ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించటం దురదృష్టకరం. దశాబ్దాలుగా నేను విలువలతో కూడిన రాజకీయాల కోసం నిలబడ్డాను. అందుకనే కాంగ్రెస్ పార్టీలో కొనసాగలేకపోతున్నాను. తెలంగాణ ప్రజలకు ఆత్మగౌరవంతో, స్వేచ్ఛగా, న్యాయంగా సేవ చేయడానికే కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నా' అని పేర్కొన్నారు.

5 గంటల కరెంటు చేతగానితనం

- గొప్పగా చెప్పకోవటం సిగ్గుచేటు
- కర్ణాటక ప్రజల కష్టాలు పట్టవా?
- తెలంగాణ ప్రజలు మిమ్మల్ని నమ్మరు
- డీకే శివకుమార్‌పై కేటీఆర్ ఫైర్

హైదరాబాద్, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ): కర్ణాటకలో ఐదు గంటల కరెంట్ ఇస్తున్నామని గొప్పగా చెప్పుకోవటం కాంగ్రెస్ పార్టీ చేతగానితనానికి నిదర్శనమని మంత్రి కేటీఆర్ అన్నారు. దాన్నీ గొప్పగా చెప్పుకోవటం సిగ్గుచేటు అని కర్ణాటక డిప్యూటీ సీఎం శివకుమార్‌పై మండిపడ్డారు. ఆ వైఫల్యాలను చూసేందుకు కర్ణాటక దాకా వెళ్లాల్సిన అవసరం లేదని, దగాపడ్డ కన్నడ రైతులే ఇక్కడికి వచ్చి వివరిస్తున్నారని విరుచుకుపడ్డారు. ఆ పార్టీకి అధికారం ఇస్తే తెలంగాణ కూడా అంధకారం అవుతుందని ప్రజలకు అర్థమైపోయిందని స్పష్టం చేశారు. ఓవైపు కర్ణాటక ప్రజలు పుట్టెడు కష్టాలతో పడరాని పాట్లు పడుతుంటే పట్టించుకోకుండా, తెలంగాణలో ఓట్ల వేటకొచ్చారా? అని డీకేను ప్రశ్నించారు. గృహజ్యోతి పథకం గాలిలో దీపంలా ఆరిపోయిందని, కర్ణాటక చీకటిరాజ్యంగా మారిపోయిందని తెలిపారు. అన్నభాగ్య స్కీమ్ అటకెక్కిందని, రేషన్ బియ్యం కూడా ఇవ్వలేక చేతులెత్తేసిన కాంగ్రెస్ తప్పిదాలకు అక్కడి ప్రజలు అన్నమో రామచంద్ర అని అల్లాడిపోతున్నారని వెల్లడించారు. రేషన్‌పై కూడా సన్న బియ్యం ఇవ్వాలన్న తమ సంకల్పానికి, కనీసం రేషన్ బియ్యం కూడా ఇవ్వలేని కాంగ్రెస్ అసమర్థ పాలనకు తేడాను తెలంగాణ సమాజం స్పష్టంగా అర్థం చేసుకుంటుందని తెలిపారు. మహిళలకు ఉచిత ప్రయాణం అని మభ్యపెట్టి మొత్తానికే కర్ణాటక ఆర్టీసీని దివాలా తీసిన విధానం ప్రజలకే కాదు, అక్కడి ఉద్యోగులకూ పెను ప్రమాదంగా మారిందని గుర్తు చేశారు. సబ్‌స్టేషన్ల వద్ద మొసళ్లతో నిరసనలు, కరెంట్ కోసం పురుగుల మందు తాగి రైతుల ఆత్మహత్య ప్రయత్నాలన్నీ కాంగ్రెస్ ఘోర పరిపాలన వైఫల్యాలకు సజీవ సాక్ష్యాలని వివరించారు. కర్ణాటకలో కమీషన్ల కుంభమేళాకు తెరతీసిన కాంగ్రెస్ అవినీతి బాగోతాన్ని చూసి తెలంగాణ సమాజం మండిపడుతున్నదని అన్నారు. కాంగ్రెస్‌ను నమ్మి మోసపోవడానికి తెలంగాణ ప్రజలు సిద్ధంగా లేరని, ఇది చైతన్యానికి అడ్డా అని కుండబద్ధలు కొట్టారు.


బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన విష్ణువర్ధన్‌రెడ్డి

కాంగ్రెస్‌కు వరుస ఎదురుదెబ్బలు

- బీఆర్ఎస్‌లోకి కీలక నేతలు
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో నాగం, విష్ణువర్ధన్‌రెడ్డి భేటీ

హైదరాబాద్/జూబ్లీహిల్స్ (నమస్తే తెలంగాణ): రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు టికెట్ల కేటాయింపు వ్యవహారంపై కాంగ్రెస్‌లో చిచ్చు రేగడంతో పలువురు కీలక నేతలు ఆ పార్టీని వీడుతున్నారు. ధనబలం ఉన్నవారికి టికెట్లు అమ్ముకుంటున్నారన్న ఆగ్రహంతో ఆ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరుతున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి, సీనియర్ నేత పీ చంద్రశేఖర్‌తోపాటు మాజీ ఎమ్మెల్యేలు ఎర్ర శేఖర్, విష్ణువర్ధన్‌రెడ్డి ఆదివారం కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. ఎర్రశేఖర్, చంద్రశేఖర్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకోగా.. నాగం జనార్దన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి టీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిశారు.

ఆదివారం హైదరాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్‌కు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బీఆర్ఎస్‌లో చేరిన ఎర్ర శేఖర్

- గులాబీ కండువా కప్పిన మంత్రి కేటీఆర్
- జడ్చర్ల నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు షాక్
- సీఎం కేసీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే

జడ్చర్ల టౌన్, అక్టోబర్ 29: జడ్చర్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీలో జడ్చర్ల అసెంబ్లీ టికెట్ ఆశించి భంగపడ్డ మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ ఆదివారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకొన్నారు. ఆ తర్వాత పార్టీ అధినేత, సీఎం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మూడు పర్యాయాలు జడ్చర్ల ఎమ్మెల్యేగా పనిచేసిన బీసీ సామాజిక వర్గానికి చెందిన కీలక నేత ఎర్ర శేఖర్ బీఆర్ఎస్‌లో చేరడంతో 'గులాబీ'కి మరింత బలం చేకూరింది. ఎర్రశేఖర్ బీఆర్ఎస్‌లో చేరడంతో ఆయన అనుచరులు, అభిమానులు జడ్చర్లలో పటాకులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. రానున్న రోజుల్లో నియోజకవర్గంలో కాంగ్రెస్ ఖాళీ అయ్యే అవకాశాలున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

బీజేపీ, కాంగ్రెస్ బీసీ వ్యతిరేక పార్టీలే

- బీసీ సీఎం పేరిట బీజేపీ కపట ప్రేమ
- కాంగ్రెస్‌లో గెలవని స్థానాలు బీసీలకు
- బీఆర్ఎస్‌తోనే బీసీలకు న్యాయం: ఎక్సైజ్ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- గెలువలేకే బీసీ రాగం: ప్రకాశ్

ఆదివారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో మాజీ మంత్రి చంద్రశేఖర్, బండా ప్రకాశ్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్

హైదరాబాద్, అక్టోబరు 29 (నమస్తే తెలంగాణ): బీజేపీ, కాంగ్రెస్ రెండూ బీసీ వ్యతిరేక పార్టీలేనని ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. ఆ పార్టీల బీసీ రాగాన్ని తెలంగాణ ప్రజలు నమ్మబోరని స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. బీసీ ముఖ్యమంత్రి అంటూ బీజేపీ కపట ప్రేమను కనబరుస్తున్నదని, గెలువని స్థానాలను కాంగ్రెస్ పార్టీ బీసీ నేతలకు ఇస్తున్నదని తెలిపారు. బీజేపీకి నిజమైన ప్రేమే ఉంటే బీసీ అయిన ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిని ఎందుకు తొలగించిందని ప్రశ్నించారు. బీసీ ప్రధాని అయితే దేశవ్యాప్తంగా ఓబీసీ వర్గాలకు మేలు జరుగుతుందని నమ్మారని, కానీ కనీసం కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖను కూడా ఏర్పాటు చేయలేదని వివరించారు. బీసీ జనగణన చేయాలని కోర్టులు చెప్పినా కేంద్రం నుంచి స్పందన కరువైందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో బీజేపీకి కనీసం నాలుగు సీట్లు కూడా రావని పేర్కొన్నారు. బీసీలకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే సరైన న్యాయం జరిగిందని చెప్పారు. ఎన్నో సంక్షేమ పథకాలు బీసీ వర్గాలకు అందుతున్నాయని వివరించారు. కేసీఆర్ సీఎం అయితేనే రాష్ట్రానికి, బీసీలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. 90కి పైగా స్థానాల్లో బీఆర్ఎస్ గెలవబోతుందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో గెలవమని తెలిసే బీజేపీ బీసీ రాగం ఎత్తుకున్నదని ధ్వజమెత్తారు. బీజేపీ ఎత్తుగడను రాష్ట్రంలోని బీసీ వర్గాలు తిప్పికొడతాయని స్పష్టం చేశారు.

ముదిరాజ్‌లు బీఆర్ఎస్ వెంటే ఉండాలి: మాజీ మంత్రి చంద్రశేఖర్

తమ సంక్షేమానికి విశేషంగా పాటుపడుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ముదిరాజ్‌లు ఏకతాటిపై ఉండి మళ్లీ నిలబెట్టుకోవాలని మాజీ మంత్రి పీ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. తెలంగాణ సాధించాక గతంలో అనివార్య కారణాల వల్ల తాను బీఆర్ఎస్ పార్టీని వీడానని, ఇప్పుడు సొంతింటికి వచ్చినట్టు ఉన్నదని చెప్పారు. తెలంగాణ అభివృద్ధిలో సీఎం కేసీఆర్‌కు చేదోడు వాదోడుగా ఉంటానని తెలిపారు. బీజేపీలో తనకు కనీస మర్యాద ఇవ్వలేదని, అందుకే ఆ పార్టీకి రాజీనామా చేసి వచ్చానని, తెలంగాణలో ఆ పార్టీ అధికారంలోకి రావడం కల్ల అని తేల్చిచెప్పారు. అనివార్య కారణాల వల్లే కేసీఆర్ ముదిరాజ్‌లకు టికెట్లు ఇవ్వలేదని, సిటింగ్‌లలో ఎవరూ లేనందునే ఆ వర్గానికి రాలేదని తెలిపారు. రాబోయే రోజుల్లో ముదిరాజ్‌లకు ఎన్నో అవకాశాలు దక్కుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ గెలుపు కోసం తాను కృషి చేస్తానని చంద్రశేఖర్ తెలిపారు.

పొర్లు దండాలు పెట్టినా కాంగ్రెస్‌కు ఓటమే!

- ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

హైదరాబాద్ (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ నేతలు పొర్లు దండాలు పెట్టినా ఆ పార్టీకి ఓటమి తప్పదని ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ స్పష్టం చేశారు. ఆ పార్టీ రెండో జాబితా ప్రకటించాక మరింత అప్రతిష్ఠ పాలైందని చెప్పారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారదాహంతో ఇష్టారీతిన హామీలను గుప్పిస్తున్నదని, వాటిని నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని చెప్పారు. కర్ణాటకలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా అమలు కావడం లేదని విమర్శించారు. ఆపద మొక్కులు తప్ప ఆ పార్టీ నేతలకు ప్రజా సంక్షేమం, రాష్ట్ర ప్రయోజనాలు ఏనాడూ పట్టవని తెలిపారు. గతంలో పీసీసీ అధ్యక్ష పదవిని డబ్బులిచ్చి తెచ్చుకున్నారంటూ ఆరోపించిన రాజగోపాల్‌రెడ్డి, ఇప్పుడు అదే పార్టీలో చేరారని ఎద్దేవా చేశారు.

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ)
టెండరు నోటిఫికేషన్
నం. SE/MP/RR సర్కిల్ ఆఫ్ SPC No. 1A/2023-24. ఓపెన్ టెండర్: SPC No. 1A/2023-24: మాస్టర్ ప్లాన్ / రంగారెడ్డి సర్కిల్‌లోని వివిధ ప్రదేశాలలో ప్రస్తుతంగల కొత్తగా నిర్మించిన సబ్‌స్టేషన్ల యొక్క TSSPDCL యొక్క వివిధ సర్కిల్‌లో IPDS స్కీమ్ క్రింద కవర్ అయిన సబ్‌స్టేషన్ల సర్వేయింగ్ మరియు మ్యాపింగ్ (సబ్‌స్టేషన్ 33KV మరియు 11KV లైన్ల పాడవు, ప్రారంభ మరియు చివరి పాయింట్లు మరియు ఫొటోలు, GPS, కో-ఆర్డినేట్స్, స్ట్రక్చర్ ఫొటో, పూర్తి సబ్‌స్టేషన్ ఫొటో మొ॥వి). (జనరల్ కేటగిరీ). టెండరు షెడ్యూల్ అమ్మకం ప్రారంభం: 30-10-2023, 11.00 గం. అమ్మకానికి ఆఖరి తేదీ: 13-11-2023, 16.00 గం. దాఖలుకు ఆఖరి తేదీ: 14-11-2023, 13.00 గం.కు, తెరచు తేదీ: 14-11-2023, 15.00 గం.కు. గమనిక: దీనికి సంబంధించి ఏదేని తదుపరి సమాచారాన్ని వెబ్‌సైట్:www.tssouthernpower.com నుండి పొందవచ్చును.. ఫోన్ నం. 7382616093.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, మాస్టర్‌ప్లాన్, రంగారెడ్డి సర్కిల్ TSSPDCL, హైదరాబాద్
DIPR RO.No. 8205-PP/CL/ADVT/1/2023-24, Dt: 28-10-2023

నల్లగొండలో జనజాతర

- సీఎం కేసీఆర్ సభలకు పోటెత్తిన జనం
- కోదాడ, తిరుమలగిరి, ఆలేరు పట్టణాలు గులాబీమయం
- కేసీఆర్ ప్రసంగానికి ఆద్యంతం జేజేలు
- అభివృద్ధి వివరిస్తున్నప్పుడు ఈలలు
- విపక్షాలపై విమర్శలకు కేరింతలు

నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో గులాబీ జనజాతర సాగింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సభలకు ఇసుకేస్తే రాలనంత జనం పోటెత్తారు. ఆదివారం కోదాడ, తుంగతుర్తి, ఆలేరు నియోజకవర్గాల్లో నిర్వహించిన బహిరంగ సభలకు అనూహ్య స్పందన లభించింది. సభలు జరిగిన పట్టణాలు గులాబీవనంగా మారాయి. సభ ప్రారంభానికి ముందు కళాకారుల ఆటాపాటలకు ఎక్కడోళ్లు అక్కడే నిల్చొని డ్యాన్సులు చేశారు.

కోదాడలో కోలాహలం

కోదాడ పట్టణంలోని కట్టకొమ్ముగూడెంలో బీఆర్ఎస్ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్‌కు మద్దతుగా ఆదివారం జరిగిన ప్రజా ఆశీర్వాదసభకు జనం పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సీఎం కేసీఆర్ సభా వేదికపైకి వచ్చే సరికి సభా ప్రాంగణమంతా జనంతో కిక్కిరిసిపోయింది. మధ్యాహ్నం 2 గంటల వరకు సభా ప్రాంగణంలో కాలుపెట్టే సందు లేకుండా పోయింది. సీఎం కేసీఆర్ హెలికాప్టర్ కనపడగానే ఒక్కసారిగా ఈలలు, కేకలు, కేరింతలతో సభా ప్రాంగణం దద్దరిల్లింది. కేసీఆర్ వేదికపైకి వస్తుంటే అంతా లేచి చప్పట్లతో స్వాగతించారు. సభ ఆసాంతం ఉత్సాహంగా, ఉల్లాసంగా సాగడం విశేషం. భారీ జన సందోహం గురించి సీఎం కేసీఆర్ ప్రస్తావిస్తూ, ఇక మల్లయ్య గెలుపును ఎవరూ ఆపలేరన్నప్పుడు జనం చప్పట్లతో ప్రతిస్పందించారు. 'మల్లయ్య బీసీ బిడ్డ.. పీహెచ్‌డీ వరకు చదువుకున్న వ్యక్తి.. ప్రజా సేవ చేయాలనే తపనతో రాజకీయాల్లోకి వచ్చిండు.. కొంత మంది కుట్రలు చేస్తూ ఎన్ని ఒడిదొడుకులు సృష్టించినా నియోజకవర్గాన్నే పట్టుకొని, జనాన్నే నమ్ముకొని తిరుగుతున్నాడ'ని కేసీఆర్ ప్రశంసించగా.. ప్రజల నుంచి మంచి స్పందన లభించింది.

తిరుమలగిరి.. జనఝరి

తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో తిరుమలగిరిలో జరిగిన సమర శంఖారావ సభ గ్రాండ్ సక్సెస్ అయ్యింది. తుంగతుర్తి నియోజకవర్గం ఆసాంతం సభకు తరలివచ్చినట్టుగా కనిపించింది. మిట్టపల్లి సురేందర్ నేతృత్వంలోని కళాకారుల ఆటపాటలకు సభ హోరెత్తింది. సీఎం కేసీఆర్ ప్రసంగానికి సభికుల నుంచి అనూహ్య స్పందన లభించింది. 'తుంగతుర్తిని చూస్తుంటే తుర్తి కలుగుతుంది' అని కేసీఆర్ అనగాన